Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక : 216 పేజీలు 8 వెల : 5 | గురువారం 19 మార్చి 2026






శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది.



2లో..

## ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

ఎందుకు దోషులను పట్టుకునే ప్రయత్నం చేయలేదు

కడప ఎంపి సీటు కోసమే వివేకా హత్యజరిగింది

పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు వ్యాఖ్యలు



2లో..

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఉచిత బస్సు సౌకర్యంతో పెరిగిన గౌరవం

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

## అనుకున్న సమయానికి పోలవరం పూర్తి



గత పాలకుల తీరుతో ప్రాజెక్టులో జాప్యం

నిర్వాసితులతో సిఎం చంద్రబాబు సమావేశం

నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత

అమరావతి:పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.



# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన సిఎం

12.75 లక్షల మందికి లబ్ది చేకూరుతుందని వెల్లడి



అమరావతి:దివ్యాంగ శక్తి పథకం ద్వారా లక్షల మందికి మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి చంద్రబాబు, మంత్రి లోకేశ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకంపై లబ్దిదారులతో సీఎం మాట్లాడారు. ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పుకొచ్చారు. తాను, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో ప్రయాణించటం ఆనందంగా ఉందని చంద్రబాబు అన్నారు. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వారని తెలిపారు. గతంలో 'చేయూత' కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని ప్రస్తావించారు. ట్రైసైకిళ్లతో పాటు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లను అందించామని గుర్తుచేశారు. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నామని స్పష్టం చేశారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే దివ్యాంగులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో ఇప్పుడు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎలాంటి ఛార్జీలు లేకుండా ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. ఈ సౌకర్యం ద్వారా నెలకు ఒక్కొక్కరికీ రూ.2 వేల దాకా దివ్యాంగులకు ఆదా అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత ఆనందంగా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమేనని చెప్పుకొచ్చారు. దివ్యాంగులకు అండగా నిలబడాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళల స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయని ప్రస్తావించారు. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మందకృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.





2లో..

## ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్రనష్టం

రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్

మక్కలు మార్కెట్లోకి వచ్చిన కొనుగోళ్లు ఏవీ

గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన

వెంటనే మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్

ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే, మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం



2లో..

## పాన్‌తో ఆధార్ లింక్

మార్చి 31 వరకు గడువు



2లో..

## కేంద్రమంత్రి గడ్కరీతో రాహుల్, ప్రియాంకల భేటీ

బస్ అండ్ ట్రక్ డ్రైవర్స్ సమస్యలపై చర్చ

నూతన రెగ్యులేటరీ ప్రమాణాలు, హెచ్చు ఫీజుల వల్ల తాము వ్యాపారాలను మానుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఇందువల్ల తామ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని వివరించారు.

## ప్రజాసేవలో పదవీ విరమణ లేదు

రాజ్యసభ ఓ ఓ పెన్ యూనివర్సిటీ

సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం

రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ



2లో..

మాతో ప్రేమాయణం.. మోడీతో అనుబంధం దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు

# ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు

సిబ్బంది నియామకం పనులు పూర్తి

రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీఎంఆర్‌డిఏ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చార్లు రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధి కారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009-2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025- 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం - అమరావతి - నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ పక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ - గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ - గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్రనష్టం

హైదరాబాద్: రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే.. ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే.. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పదిహేను రోజులుగా కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడం చూస్తుంటే ప్రభుత్వ ఆంతర్యం ఏమిటో అర్థమవుతోందని అన్నారు. పంట అంతా దళారుల పాలైన తర్వాత, ఆ దళారుల దగ్గర ఎక్కువ ధరకు కొని వాళ్లకు మేలు చేయాలని ప్రభుత్వం చూస్తోందా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందా? దళారులకు మేలు చేస్తుందా? అనేది స్పష్టం చేయాలన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక నష్టపోతుంటే, మరోవైపు అకాల వర్షాలకు మార్కెట్ యార్డుల్లో, కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న తడిచిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కురిసిన వడగండ్ల వానలకు మొక్కజొన్న, మామిడి సహా ఇతర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని పేర్కొన్నారు. బ్జడెట్‌లో పంటల బీమా గురించి గొప్పగా ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వం అటు పంటల బీమా అమలు చేయదు, ఇటు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వదని మండిపడ్డారు. గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర రైతాంగానికి ఇన్ పుట్ సబ్సిడీ అందడం లేదని తెలిపారు.



ప్రభుత్వం కేవలం మాటల్లో చెబుతున్నదే తప్ప, ఇప్పటివరకు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు సబ్సిడీ నిధులను విడుదల చేయడం లేదని అన్నారు. అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల జరిగిన నష్టంపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వెంటనే నివేదికలు తెప్పించుకోవాలని సూచించారు. తక్షణమే ఎన్యూమరేషన్ చేసి నష్టపోయిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలన్నారు. మద్దతు ధర లేకపోవడంతో పాటు వర్షాల కారణంగా అన్నదాతలు నష్టపోతున్నారని తెలిపారు. 25 శాతం పంట.. దళారుల చేతికి వెళ్లిందని అన్నారు. పంటల బీమా అమలు చేయడం లేదని విమర్శించారు. వడగండ్ల వానతో రైతులు నష్టపోయారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదని... వెంటనే ఇవ్వాలన్నారు. రూ.2400 మద్దతు ధర.. రూ.500 బోనస్ వెంటనే ప్రభుత్వం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు.మొక్కజొన్న రైతులను కాంగ్రెస్ సర్కార్ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మార్షల్స్ దురుసుగా ప్రవర్తించారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద ఎమ్మెల్యేల నుంచి మక్కలు, కందులు లాక్కున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీశ్‌రావు చేతికి గాయమైంది. గాయం కావడంతో హరీశ్‌రావు చేతి నుంచి రక్తం కూడా వచ్చింది. మరోవైపు అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద పాడి కౌశిక్ రెడ్డి చేతిలో నుంచి చీఫ్ మార్షల్ కరుణాకర్ మక్కలు లాక్కొని కిందపడబోశారు. మార్షల్స్ తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎంట్రన్స్ వద్ద కూర్చొని నిరసన తెలిపారు. మార్షల్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ప్రజాసేవలో పదవీ విరమణ లేదు



న్యూఢిల్లీ:రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు.ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విభేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు. పార్లమెంట్ ప్రక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒక సభలో తీసుకున్న నిర్ణయం.. రెండో ఓపీనియన్ కోసం మరో సభకు వెళ్తుందని, అక్కడ జరిగిన చర్చతో నిర్ణయాత్మక విధానం కొత్త రూపు సంతరించుకుంటుదని ప్రధాని అన్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం నాడు కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏళ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోదీని పెళ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు. దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. దేవెగౌడ 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత సుమారు ఒక ఏడాది పాటు ప్రధానమంత్రిగా ఉన్నారు. దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతిచ్చింది.

## కేంద్రమంత్రి గడ్కరీతో రాహుల్, ప్రియాంకల భేటీ

**బస్ అండ్ ట్రక్ డ్రైవర్స్ సమస్యలపై చర్చ**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా బుధవారంనాడు పార్లమెంటు హౌస్‌లో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలుసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. బస్ అండ్ ట్రక్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి ముందు, స్మాల్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రతినిధి బృందం సభ్యలు రాహుల్ గాంధీ కలుసుకున్నారు. సవరించిన నిబంధనల వల్ల ధరలు, లైసెన్సులు పొందడంలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. నూతన రెగ్యులేటరీ ప్రమాణాలు, హెచ్చు ఫీజుల వల్ల తాము వ్యాపారాలను మానుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందని, ఇందువల్ల తామ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని వివరించారు.గడ్కరితో సమావేశానంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ, లైసెన్స్ ప్రక్రియ ఖరీదైన వ్యవహారంగా మారడం, కాలహరణం జరుగుతుండటం వంటివి చోటుచేసుకుంటున్నాయని, ఈ విషయాన్ని గడ్కరి దృష్టికి తెచ్చామని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని గడ్కరి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

## పాన్‌తో ఆధార్ లింక్ మార్చి 31 వరకు గడువు

న్యూఢిల్లీ: కొత్త పాన్ కార్డు పొందాలనుకుంటే దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు కాపీని జత చేస్తే సరిపోతుంది. అయితే రాబోయే ఆర్థిక సంవత్సరం నుంచి అలా కుదరదు. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి 31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమనే సంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది. అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఎప్రిల్ ఒకటి తర్వాత పాత పాన్ దరఖాస్తు ఫారాలను కూడా అనుమతించేది ఉండదని కామన్ సర్వీస్ సెంటర్ పేర్కొంది. ఏప్రిల్ 1 నుంచి పాన్ దరఖాస్తు ఫారాలు కూడా మారతాయని, కొత్తవి అందుబాటులోకి వస్తాయని కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. అలాగే ఆన్‌లైన్‌లో కొత్త పాన్ కార్డు దరఖాస్తు కోసం బీబితితిబిబ ÷ఔజీని, ఖసనీబిIజీని వెబ్‌సైట్లను సందర్శించాలని పేర్కొంది.

## బడ్జెట్‌లో బిసిలకు 50శాతం కేటాయింపు

**ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి**

**అసెంబ్లీలో మాజీమంత్రి తలసాని**

హైదరాబాద్: జనాభా లో 50 శాతం ఉన్న బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం బీసీల సంక్షేమానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ. 20 వేల కోట్లు కేటాయించాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండు బడ్జెట్‌లు అయిపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు రూ. 10 వేల కోట్ల వరకు ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం చెల్లించాలని కోరారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల కారణంగా అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించే బీసీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు జ్యోతిరావు పూలే ఓవర్సీస్ కార్యక్రమాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని, ఆ పథకం క్రింద అర్హులైన విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో బిల్లు పెడితే చట్టబద్ధత రాదని, కేంద్ర ప్రభుత్వం 9 వ షెడ్యూల్ లో చేరిస్తేనే చట్టబద్ధత వస్తుందన్న విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తే పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరుకాకపోవడం బీసీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

**డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా**

**మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం**

**పేదల ఇళ్లు కూల్చివేత దారుణం**

**బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత**

**అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్**

**ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్**

హైదరాబాద్: మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం..



దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ¸÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ కారణంగానే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు బీఆర్ఎస్ హాజరుకాలేదని స్పష్టం చేశారు. మూసీ నదిని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. ఇప్పుడు అదే పార్టీ ప్రజల పేరుతో భారీ ప్రాజెక్ట్ పేరుతో అవినీతి చేయాలని చూస్తోందని అన్నారు. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉంటే వెంటనే సభలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ అస్పష్టతకు నిదర్శనమని విమర్శించారు. మొదట 1,400 ఇళ్లు కూల్చివేస్తామని చెప్పి, ప్రస్తుతం 10,000 ఇళ్లకు పైగా నోటీసులు ఇవ్వడం ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో సొంత జిల్లాలోనే ఇళ్లు కూల్చివేస్తున్నా ఉప ముఖ్యమంత్రికి కనీస సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వద్ద నిధులు లేవని, సరైన ప్రణాళిక లేదని, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ లోన్ కూడా లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్ డీపీఆర్ తయారీని 'మెయిన్ హార్ట్' అనే కంపెనీకి అప్పగించారని, ఈ కంపెనీని సింగపూర్, పాకిస్తాన్, భారతదేశంలోని అనేక సంస్థలు బ్యాన్ చేశాయని తెలిపారు. గతంలో ఇదే అసెంబ్లీలో డీపీఆర్ తయారీకి కనీసం 18 నెలలు పడుతుందని చెప్పి, ఇప్పుడు కేవలం రెండు నెలల్లో డీపీఆర్ సిద్ధమైందని చెబుతుండటం అనుమానాస్పదమని అన్నారు. రెండు నెలల్లో అద్భుతంగా డీపీఆర్ తయారు చేసి ఉంటే, దాన్ని ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్టుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణం ఇవ్వడానికి అంగీకరించిందని మంత్రి శ్రీధర్ బాబు సభలో చెప్పారని, కానీ బ్యాంక్ అధికారులను సంప్రదించగా జనవరి 23 నాటికి ఎలాంటి డీపీఆర్ తమకు అందలేదని, కాబట్టి రుణంపై ఎలాంటి అంగీకారం లేదని స్పష్టం చేశారని తెలిపారు. మార్చి 11న కూడా అదే విషయాన్ని ఏడీబీ మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ప్రభుత్వం తన సమాచారాన్ని సరిదిద్దుకోవాలి లేదా కావాలనే ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నదా అనే అనుమానం కలుగుతోందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

శ్రీకాకుళం: రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కొత్తగా ప్రారంభించిన 'దివ్యాంగ శక్తి' పథకం ద్వారా దివ్యాంగులు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణస్తూ ఎంతో లబ్ధిపొందుతున్నారన్నారు. చరిత్రలో దివ్యాంగులకు ఎప్పుడు మేలు జరిగినా అది సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమైందని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక గౌరవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం అద్భుత విజయాన్ని అందుకుంది. అదే బాటలో ఇప్పుడు 'దివ్యాంగ శక్తి' సూపర్ హిట్ అవుతుంది. ఇప్పటివరకు దాదాపు 150 కోట్ల మంది మహిళలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించారంటే ఈ పథకం ఎంతటి ఘన విజయం సాధించిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో మొత్తం 12.70 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. ప్రస్తుతం 2 లక్షల మంది మాత్రమే పాస్‌లు కలిగి ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో సుమారు 42 వేల మంది దివ్యాంగులు ఉన్నారు. వారందరికీ పాస్‌లు అందేలా చర్యలు తీసుకుంటాం. ఇందుకోసం బస్ స్టేషన్లలో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, వంద శాంతం మందికి పాస్‌లు అందజేసేలా పక్రియను సరళీకరణ చేస్తాం' అని అన్నారు.

# ఐదేళ్లలో జగన్ ఎందుకు వివేకా కేసు తవ్వలేదు

విశాఖపట్నం: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల కీలక వ్యాఖ్యలు చేశారు. ఐదేళ్ల పాలనలో జగన్ ఎందుకు ఈ కేసును తేల్చలేక పోయారని అన్నారు. దీనికి ఎందుకు న్యాయం చేయలేదని నిలదీసారు. బుధవారం విశాఖపట్నంలో షర్మిల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి.. వివేకా కుమార్తె సునీత మీద చేసిన వ్యాఖ్యలకు తాను చాలా బాధపడ్డానని అన్నారు. వివేకాకు గుండెపోటు వచ్చిందని సునీతనే చెప్పారని.. అవినాశ్‌రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. అవినాశ్‌రెడ్డికి పలుకుబడి, డబ్బు ఉందని, ఎన్ని తప్పులు చేసిన తప్పించుకోవచ్చని అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. సోషల్ మీడియాను చేతిలో పెట్టుకుని వ్యక్తిత్వ హననం చేయాలనుకుంటున్నారని ధ్వజమెత్తారు. వివేకానంద గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియాలోనే మొదటగా ప్రచారం చేశారని షర్మిల ప్రస్తావించారు. స్థానికంగా ఉన్న అవినాశ్‌రెడ్డి, సాక్షి యజమాని భారతిరెడ్డి ఎందుకు గుండెపోటని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టిక్కెట్టు విషయంలోనే జరిగిందని చెప్పుకొచ్చారు. ఈ విషయంపై వివేకానంద స్వయంగా తనతో చర్చించారని తెలిపారు. అవినాశ్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే, వివేకానంద సపోర్ట్ చేశారని గుర్తుచేశారు. ఎప్పటికైనా వివేకానంద బతికి ఉంటే, తనకు ఇబ్బంది అవుతుందనే కారణంతోనే అవినాశ్‌రెడ్డి ఈ హత్య చేశారని ఆరోపించారు. వివేకా హత్య కేసులో మొదటగా సీబీఐ విచారణ కావాలని జగన్ అన్నారని, ఆ తర్వాత వద్దని కూడా ఆయనే చెప్పారని తెలిపారు. వివేకా కేసును సిట్ అధికారులతో విచారణ చేయిస్తే సరిపోతుందని జగన్ చెప్పారని అన్నారు. ఈ కేసులో సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని, ప్రధానంగా అవినాశ్‌రెడ్డి పేరును ప్రస్తావించిందని తెలిపారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు ఒక్క ఆధారం కూడా బయటపెట్టలేక పోయారని ప్రశ్నల వర్షం కురిపించారు. సునీతారెడ్డి చంద్రబాబు కోసం పనిచేస్తున్నారని చెబుతూ.. అవినాశ్‌రెడ్డిని కాపాడుకోవాలని జగన్ ప్రయత్నిస్తున్నారని షర్మిల అన్నారు. సునీతకు ప్రాణహాని ఉందని, అయినా ఆమె పోరాటం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. తన తండ్రి హత్య వెనుక ఉన్న నిజాన్ని బయటకు తీసుకురావాలని సునీత పోరాటం చేస్తున్నారని అన్నారు. 'జగన్ అన్నకు కూసింతైనా కనికరం లేదా..? ఇలాంటి అన్న ఉంటే శత్రువులు అనవసరం.. అన్నా అనే పదానికే ఆయనో కళంకం. జగన్ మోహన్‌రెడ్డి బాధితులపట్ల కాకుండా నిందితులపట్ల నిలబడ్డారనే విషయం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి తెలిస్తే ఎంతగానో బాధపడేవారు. వివేకా హత్య కేసులో న్యాయం కోసమే చంద్రబాబును కలిశారని.. నిరంతరం పోరాటం సాగిస్తున్నారని.. కానీ న్యాయం మాత్రం జరగట్లేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

# హర్మూజ్ జలసంధి వద్ద భారీ సైనిక చర్య

**5 వేల పౌండ్ల డీప్ పెనెట్రేటర్ బాంబుల ప్రయోగం**

**అమెరికా తీరుపై మండిపడుతున్న ఇరాన్**

వాషింగ్టన్:హోర్ముజ్ జలసంధిని మళ్లీ ప్రారంభించేందుకు అమెరికా సైన్యం భారీ సైనిక చర్యకు దిగింది. ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న కఠిన రక్షణ గల మిస్సైల్ స్థావరాలపై 5 వేల పౌండ్ల డీప్ పెనెట్రే టర్ బాంబులను వరుసగా ప్రయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ స్థావరాల్లో ఉన్న యాంటీ షిప్ క్రూజ్ మిస్సైళ్లు హోర్ముజ్ మార్గంలో ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు పెద్ద ముప్పుగా మా రినట్లు తెలిపింది. ఈ దాడులతో ఆ ముప్పును నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించింది. అమెరికా ఇజ్రాయెల్ యుద్ధా నికి ప్రతిగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూ సివేయడంతో ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదో వంతు ప్రభావితమైంది. అనేక దేశాలకు చెందిన చమురు నౌకలు అక్కడే నిలి చిపోవడంతో సముద్ర రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ పరిణామాల మధ్య హోర్ముజ్ భద్రత కోసం సహకరించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్ర దేశాలను కోరినా పెద్దగా స్పందన రాలేదు. నాటో దేశాలు కూడా సైనిక సహాయం విషయంలో వెనుకంజ వేశాయి. 'మేము ఎంతోసహాయం చేసినప్పటికీ మాకు మద్దతు రావడం లేదు' అంటూ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు.

ఉత్తేజిత దినపత్రిక



# పోలకల్,బ్రాహ్మదొడ్డి గ్రామాలలో నందు రైతన్న మీకోసం

**ఉత్తేజిత న్యూస్ మార్చి 18 సి.బెళగల్**



సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణ దొడ్డి మరియు పోలకల్ గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ మూడవ విడత పిఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ సంబంధించి నేరుగా రైతుల అకౌంట్లో ?6000 చొప్పున తమ ఖాతాలోకి జమ అయ్యాయని తెలియజేశారు. పోలకల్ గ్రామంలో మూడో విడత కింద 1494 మంది రైతులు లబ్ధిదారులకు 89లక్షల 64 వేల రూపాయలు జమ అయ్యాయని తెలియజేశారు. అదేవిధంగా బ్రాహ్మణ దొడ్డి గ్రామంలో రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు 1485 రైతులకు గాను 89 లక్షల పదివేల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని వ్యవసాయ అధికారి తెలియజేశారు. ముఖ్యంగా ఈ కార్యక్రమము యొక్క ముఖ్య ఉద్దేశం గౌరవనీయుల ముఖ్యమంత్రివర్యులు ఆంధ్రప్రదేశ్ ని స్వర్ణాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దడంలో వ్యవసాయ శాఖ దేశంలోని అగ్రగామిగా నిలబట్టే దిశగా ముందుకు సాగుతున్నామని ప్రతి రైతులు ఆధునిక సాంకేతిక, టెక్నాలజీని ఉపయోగించుకొని పంటలు సాగు చేసుకోవాలని తెలియజేశారు. ముఖ్యంగా నీటి భద్రత మరియు డిమాండ్ ఆధారిత పంటలను రైతులు సాగు చేసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా అగ్రిటెక్ సాంకేతికతో వ్యవసాయ రంగంలో డ్రోన్ మరియు రోబోటిక్స్ ద్వారా పంటల్లో వచ్చేటువంటి చీడపీడలను గుర్తించడానికి ఏఐ ఆధారిత పెస్ట్ సర్వేలెన్సును వినియోగించుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా రైతులు పండించినటువంటి పంటలకు పంట ఉత్పత్తికి ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ఆదాయం పెరగాలి అని తెలియజేశారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ద్వారా రైతు పండించినటువంటి పంటలకు మద్దతు ధర ద్వారా పంటను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ముఖ్యంగా రైతులకు వ్యవసాయ అధికారి రాబోయే ఖరీఫ్ సీజన్లో ఎక్కువ నీటిని వినియోగించకుండా వర్షాధారంపై ఆధారపడి పంటలను పండించుకోవాలన్నారు వాతావరణ పరిస్థితులను బట్టి ఎల్నినో ప్రభావం మన దేశంపై రాష్ట్రంపై చూపుతుందని రైతులు దీనిని గమనించుకొని పంటలు సాగు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ వ్యవసాయ సిబ్బంది శశికాంత్,లలిత,హనీఫ్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు శిరీష హిమబిందు రైతు సోదరులు పాల్గొన్నారు.

# మంగళం డిపోలో 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం....

**ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి - ట్రాఫిక్ ఇన్స్పెక్టర్. స్టార్ కృష్ణ.**

**ఉత్తేజిత తిరుపతి మార్చి 18.**



బుధవారం మంగళం లో తిరుపతి ఆర్డీఓ రామ మోహన్, మంగళం డిపో మేనేజర్ సుధాకర్ చేతులమీదుగా ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి స్కీమ్ ను ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామ మోహన్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం విజయవంతం అయిన తర్వాత దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం అందించాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన నుండి పుట్టిన మరో ఉపయోగకరమైన పథకం దివ్యాంగ శక్తి పథకం అని తెలిపారు. మంగళం డిపో మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ దివ్యాంగ శక్తి స్కీమ్ ను నలభై శాతం అంగవైకల్యం ఉన్న వారందరూ పల్లెవెలుగు, సిటీ,ఆర్డినరీ, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ తదితర సర్వీసులలో దివ్యాంగులు ప్రయాణించవచ్చని, నూరు శాతం వైకల్యం ఉన్నవారికి మరియు అరవై తొమ్మిది శాతం కంటే తక్కువ ఐక్యూ ఉన్న దివ్యాంగులకు సహాయంగా వచ్చేవారికి యాభై శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు డి.ఎం.గారు తెలియజేశారు. దివ్యాంగులందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పద్మావతి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ స్టార్ కృష్ణ, కండక్టర్ రేఖ, డ్రైవర్ జి.ఆర్.చంద్ర, అన్ని అసోసియేషన్ల నాయకులు, కూటమి ప్రభుత్వ నాయకులు మరియు దివ్యాంగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వందమంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా



కర్నూలు : అల్లాహ్ మార్గాన్ని అనుసరించి రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకుని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయం అని విజయ మిల్క్ డైరీ మాజీ డిప్యూటి డైరెక్టర్ డిఎం.వలి అన్నారు. కర్నూలు పట్టణంలోని స్కంద హైబిస్కస్ నందు బుదవారం ఉల్చాల రోడ్, ఎన్టీఆర్ కాలనీ, బిల్డింగ్స్, నెహ్రూ ఆటో నగర్, రేడియో స్టేషన్ ప్రాంతాల్లో వుండే వంద మంది నిరు పేద ముస్లిం కుటుంబాలకు వివిధ రకాలైన సరుకులు బియ్యం, సేమియా, నెయ్యి, మంచి నూనె, గోడంబి, ద్రాక్ష, బాదం, చక్కెర, కొబ్బర ఇతర నిత్యవసర సరుకులు వలి కుటుంబ సభ్యులు కలిసి రంజాన్ తోఫాను అందజేశారు. ఈసందర్భంగా మాజీ డిప్యూటీ డైరెక్టర్ వలి మాట్లాడుతూ నిరుపేద ముస్లింలు సైతం పండుగను ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా రంజాన్ తోఫా అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఖుర్షీద్, రహింభి, షీఫా, జుఫీష తదితరులు పాల్గొన్నారు.

# రేణిగుంట ఈద్గాలో ముమ్మరంగా రంజాన్ ఏర్పాట్లు..

**ఎమ్మెల్యే బొజ్జల ఆదేశాలతో సర్వాంగ సుందరంగా మైదానం...**

**ముస్లింల పక్షపాతిగా సుధీర్ రెడ్డి నిలుస్తారని కొనియాడిన పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకుడునవాబ్.**

**రేణిగుంట, ఉత్తేజిత మార్చి 18:**



ముస్లిం సోదరుల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, రేణిగుంట పట్టణంలోని ఈద్గా మైదానం ప్రత్యేక ప్రార్థనల కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఈ పవిత్ర ఈద్-ఉల్-ఫితర్ ( రంజాన్) పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

వేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు:-

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈద్గా ప్రాంగణంలో అభివృద్ధి, మరమ్మత్తు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ముస్లిం సోదరులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నమాజ్ ఆచరించేందుకు గాను, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మైనార్టీ ముస్లిం నాయకుడు నవాబ్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తున్నారు. జె.సి.బి యంత్రాల సహాయంతో మైదానంలోని ఎత్తుపల్లాలను సరిచేసి, భక్తుల సౌకర్యార్థం సమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విశాలమైన చలువ పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈద్గాలో ప్రార్థనలకు వచ్చే వేలాది మంది కోసం స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం,క్రమబద్ధమైన పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

?ఈద్గా పరిసరాలను పూర్తిగా శుభ్రం చేసి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరుపుకునేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

?మైనార్టీల సంక్షేమమే ధ్యేయం:-

? రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకుడు నవాబ్ మాట్లాడుతూ.. "ముస్లింల కోరిక మేరకు తక్షణమే స్పందించి, ఈద్గా వద్ద అవసరమైన మరమ్మత్తులు చేయించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కి మా ప్రత్యేక కృతజ్ఞతలు. రంజాన్ పవిత్ర మాసంలో ముస్లింలందరూ కఠిన ఉపవాస దీక్షలు చేస్తారు. మాసం చివరి రోజున నెలవంక కనపడగానే ఈద్గాకు వెళ్లి అల్లాను ప్రార్థిస్తారు. అటువంటి పవిత్ర ప్రదేశంలో వచ్చే ముస్లింలకు అసౌకర్యం కలగకుండా చేయడమే మా లక్ష్యం," అని పేర్కొన్నారు.

?మండలంలోని ముస్లిం పెద్దలు నాయకులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అంకితభావాన్ని కొనియాడుతూ, ఈద్గాను సుందరీ కరణం, సౌకర్యాలు కనిపించడంపై చేస్తున్న ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేలాదిగా ముస్లింలు ప్రార్థనల కోసం ఈదుగాకు తరలివచ్చే వారి కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడంలో యంత్రాంగం నిమగ్నమై ఉంది.

# పలు జిల్లాల్లో అతి భారీ వర్షాలు..!

**- ఈ జిల్లాల ప్రజలకు వాతావరణశాఖ హెచ్చరిక..**

**తిరుపతి స్టాఫ్ రిపోర్టర్ ఉత్తేజిత మార్చి 18.**



ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాలకు వాతావరణశాఖ వర్షసూచన జారీ చేసింది. పలు ప్రాంతాల్లో భారీ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలో వాతావరణం మారింది. భిన్న వాతావరణ పరిస్థితులు ఏపీలో నెలకొంటున్నాయి. మొన్నటివరకు ఎండ తీవ్రత కొనసాగగా.. రెండ్రోజుల నుంచి ఆకాశంలో మబ్బులతో పాటు చిన్నపాటి వర్షపు చినుకులు పడుతున్నాయి. పలు జిల్లాల్లో కురుస్తున్న చిరు జల్లులతో ఎండ ప్రభావం నుంచి ప్రజలకు చల్లని ఊరటనిస్తుంది. భానుడి ప్రతాపం నుంచి కొంత ఉపశమనం లభించింది. కొన్ని జిల్లాల్లో స్వల్ప వర్షాలు కురుస్తుండగా.. మరికొన్ని జిల్లాల్లో ఎండలు కొనసాగుతున్నాయి. పలు జిల్లాల్లో వర్షాలకు సంబంధించివాతావరణశాఖ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు కూడా ఇచ్చింది. వాతావరణశాఖ అంచనాల ప్రకారం రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో వాతావరణం ఎలా ఉంటుందో చూద్దాం. రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు పడతాయని హెచ్చరించింది. కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది.

**ఈ జిల్లాలకు వర్షసూచనలి**

ఏపీలోని పలు జిల్లాలకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ రెయిన్ అలర్ట్ జారీ చేసింది. పోలవరం, అల్లూరి సీతారామరాజు, నెల్లూరు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఇక మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడతాయని అంచనా వేసింది. పిడుగులు పడే అవకాశం ఉన్న క్రమంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని సూచించింది. వర్షాల క్రమంలో వచ్చే నాలుగు రోజుల పాటు కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయని తెలిపింది. రెండు, మూడు డిగ్రీలు ఎండలు తగ్గుతాయని స్పష్టం చేసింది.

# ఈ నెల 20,21 వ తేదీలలో రెండు రోజుల పాటు తిరుమల తిరుపతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన.

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదు: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్....**

**ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు భద్రత ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలి: ఎస్పీ సుబ్బరాయుడు**

**తిరుపతి, స్టాఫ్ రిపోర్టర్ మార్చి 18.**



ఈ నెల 20,21 వ తేదీలలో రెండు రోజుల పర్యటన నిమిత్తం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబం సమేతంగా తిరుపతి, తిరుమల కు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్. పేర్కొన్నారు.

బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫిరెన్స్ హాలు నందు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తో కలసి ఏ ఎస్ ఎల్ లో ( ముందస్తు భద్రత లైజన్ ) భాగంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి పర్యటన భద్రత ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా ఎలాంటి చిన్న పొరపాట్లు కు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు.

ఈ నెల 20 న శుక్రవారం అగ్రికల్చర్ యూనివర్సిటీ నందు హెలికాప్టర్ ద్వారా ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు చేరుకొని అక్కడి నుండి రోడ్డు మార్గాన తిరుమల శ్రీపద్మావతి అతిథి గృహం చేరుకుంటారని తెలిపారు. శనివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని అనంతరం తిరుమల నుండి బయలుదేరి అగ్రికల్చర్ యూనివర్సిటీ నందు హెలికాప్టర్ ద్వారా ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు చేరుకొని తిరుగుప్రయాణం కానున్నారని తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ వారు ప్రత్యేక డాక్టర్లు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ ఏర్పాట్లు చేయాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు, ఫైర్ సేఫ్టీ,శానిటేషన్, కాన్వాయ్ వాహనాలు తదితరాల ఏర్పాటు పై సమీక్ష నిర్వహించారు. విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎస్పీ మాట్లాడుతూ.. హెలిప్యాడ్ వద్ద పోలీస్ శాఖ తరపున బందోబస్తు పక్కాగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, హెలిప్యాడ్ నుంచి తిరుమల అతిధి గృహము నకు వెళ్ళు వరకు విధులను జాగ్రత్తగా చూసుకోవాలని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాలను ,ఎస్పీ సుబ్బరాయుడు, సంబంధిత అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించు ప్రదేశాలు, పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవిమనోహర్చారి, తిరుపతి, శ్రీకాళహస్తి ఆర్డీవోలు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, , జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, డి టి సి మురళీమోహన్, ఆర్ అండ్ బి, ఎస్. ఈ రాజా నాయక్, డి ఎస్ ఓ రాజు, డి పి ఓ, సుశీలా దేవి, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సంబంధిత అధికారులు,తహాశీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే ముఖ్యం...





**రంగంలోకి దిగిన ఆర్టీవో అధికారులు.. బస్సుల ఫిట్‌నెస్ పరిశీలన....**

**రేణిగుంట ఉత్తేజిత మార్చ్18.**

విద్యార్థుల భద్రతే ధ్యేయంగా తిరుపతి ఆర్టీవో మురళీమోహన్ ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు (బ్రేక్ ఇన్స్పెక్టర్లు) బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులను నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించారు. బస్సుల్లో ఫిట్‌నెస్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పర్మిట్ పత్రాలను అధికారులు తనిఖీ చేశారు. విద్యార్థుల రక్షణ కోసం బస్సుల్లో అత్యవసర ద్వారం, ప్రథమ చికిత్స కిట్ మరియు అగ్నిమాపక పరికరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నిబంధనలు ఉల్లంఘించే స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నోవి పాఠశాల యందు ముందస్తు ఉగాది,రంజాన్ పండుగ వేడుకలు

**అన్ని మతాలు ఒక్కటే అని చాటి చెప్పిన చిన్నారులు.**

**తుగ్గలి: ఉత్తేజిత న్యూస్:**





మండల కేంద్రమైన తుగ్గలి లో గల నోవి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు బుధవారం రోజున ముందస్తు ఉగాది,రంజాన్ వేడుకలను విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ తెలుగుదనం ఉట్టిపడేలా చక్కటి వస్త్రధారణతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ముస్లిం భాయి భాయి అనే నినాదంతో బ్రాహ్మణులు, ముస్లింలు ఒకరికొకరు ఉగాది,రంజాన్ పండుగల శుభాకాంక్షలు చెప్పుకునే సన్నివేశాన్ని విద్యార్థులు చక్కగా ప్రదర్శించి అలరించారు. అనంతరం కరస్పాండెంట్ తిప్పయ్య మాట్లాడుతూ అందరికీ ముందస్తుగా ఉగాది,రంజాన్ పండుగల శుభాకాంక్షలు తెలియజేస్తూ మన భారతదేశంలో అన్ని మతాలు ఒక్కటే అని,అందరూ కలిసిమెలిసి సమాజంలో జీవించాలని ఆయన తెలియజేశారు .ఒకరికొకరు సహాయ సహకారాలను అందించుకుంటూ సోదరభావంతో విద్యార్థులందరూ జీవితాన్ని కొనసాగించాలని ఆయన తెలియజేశారు. అనంతరం ఉగాది పచ్చడి ను,ఖీర్ ను ఒకరికి ఒకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తేజిత దినపత్రిక




## మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడు జయంతి సందర్భంగా ఘన నివాళులు...



**తిరుపతి ఉత్తేజిత మార్చి 18.**

మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకలను పురస్కరించుకుని, తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి నారావారిపల్లి యన్ ఆర్ యన్ పార్క్ దగ్గర రామ్మూర్తి నాయుడు సమాధి వద్ద ఘన నివాళులు అర్పించారు.నారా రామ్మూర్తి నాయుడు తన హయాంలో చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసిన గొప్ప నాయకుడని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు రామ్మూర్తి నాయుడు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించి

**మున్సిపాలిటీఅభివృద్ధికి పాలుపంచుకోండి**

**మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి**

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూర్ మార్చి 18 :**



పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో ఇంటిపన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి పాలుపంచుకోవాలని నందికొట్కూరు పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు మొదటి అర్థసంవత్సరానికి జూన్ నెలఖారులోపు మరియు రెండవ అర్ధసంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు పన్ను చెల్లించనియెడల 2% వడ్డీతో కలిపి చెల్లించవలసి ఉంటుంది. అయితే పన్ను చెల్లింపుదారుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మరియు పురపాలకసంఘాలలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూలు మెరుగుపరుచుటకు, ఆస్తిపన్ను మరియు ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏకమొత్తంలో తేదీ : 30-04-2025 లోపు చెల్లింపు చేసుకొనుటకు వ్యవధిని పెంచుతూ, అట్టి చెల్లింపుదారులకు వడ్డీ 50% రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.66. తేదీ: 10.04.2025 లో ఉత్తర్వుల ప్రకారం ఆస్థి మరియు ఖాళీ స్థలాల పన్ను బకాయిలను అనగా ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు (అర్రేయర్ ) మరియు ఈ ఆర్థిక సంవత్సరం పన్ను బకాయిలను (కరెంటు ), 50% వడ్డీతో 30.04.2025 లోపు ఒకేసారి ఏకమొత్తంలో చెల్లించి మిగతా 50% వడ్డీ రాయితీని పొందవచ్చు. ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా వడ్డీ కట్టిన వారందరికీ కూడా వర్తించును, సదరు వడ్డీలో 50% రాబోవు ఆర్థిక సంవత్సర పన్నులకు జమ కాబడును.కావున ప్రభుత్వం వారు కల్పించిన ఈ సదవకాశాన్ని రాష్ట్రం లో గల

అన్ని మునిసిపల్ కార్పొరేషన్స్, మునిసిపాలిటీలు మరియు నగర పంచాయతీలలో

గల ప్రజలు వినియోగపరుచుకొని మీ యొక్క ఆస్తి మరియు ఖాళీ జాగా పన్ను బకాయిలని 50% వడ్డీతో ఒకే సారి తేది. 30.04.2025 లోపు చెల్లించా వలసిందిగా మున్సిపల్ కమిషనర్ మీడియా ద్వారా ఒక ప్రకటనలు పేర్కొన్నారు.




## వర్షానికి గోడకూలి బాలుడు మృతి -- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే గిత్త జయసూర్య..

**ఉత్తేజిత.ప్రతినిధి నందికొట్కూరు మార్చి. 18**





నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం లోని పగిడ్యాల మండలం వేస్ట్ ప్రాతకోట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆకస్మికంగా కురిసిన వర్షం కారణంగా గోడ కూలిపోవడంతో అరుణ్ కుమార్ కుమారుడు (అభి సంవత్సరం బాలుడు) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో జరిగింది.

విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య వెంటనే నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ పరిస్థితిని పరిశీలించి, మండల తహసిల్దార్‌ను పూర్తి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి కూడా పాల్గొని కుటుంబ సభ్యులను ఆదుకున్నారు.

ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# దివ్యాంగ శక్తీ పథకాన్ని ప్రారంభించిన టిడిపి నాయకులు



దేవనకొండ మార్చి 18 (ఉత్తేజిత)



దేవనకొండ మండల కేంద్రంలో ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకుదేవనకొండ మండలం పత్తికొండ కర్నూల్ ప్రధాన రహదారి దేవనకొండ బస్టాండ్ లో దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగులు ఉచిత బస్సు టిడిపి నాయకులు ప్రారంభించారు.టికెట్ తీసుకొని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ 11.16 లక్షల మందికి ఉగాది కానుక దివ్యాంగ శక్తి పథకం ద్వారా 12.76 లక్షల మంది దివ్యాంగులు, సహాయకులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, సీనియర్ నాయకులు ఉచ్చురప్ప పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

స్త్రీ శక్తి పథకం విజయవంతం అయిన తర్వాత దివ్యాంగులకు కూడా ఉచిత ప్రయాణం అందించాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన నుండి పుట్టిన మరో ఉపయోగకరమైన పథకం దివ్యాంగ శక్తి పథకం అని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ దివ్యాంగ శక్తి స్కీమ్ ను 40 శాతం అంగవైకల్యం ఉన్న వారందరూ పల్లెవెలుగు, సిటీ,ఆర్డినరీ, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ తదితర సర్వీసులలో దివ్యాంగులు ప్రయాణించవచ్చని, 100 శాతం వైకల్యం ఉన్నవారికి మరియు 69 శాతం కంటే తక్కువ ఐక్యు ఉన్న దివ్యాంగులకు సహాయంగా వచ్చేవారికి 50 శాతం రాయితీతో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలియజేశారు. దివ్యాంగులందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకొని కోరారు.


పథకం అమలుకు ఏడాదికి రూ.207 కోట్లు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి చేర్మెన్ రాజశేఖర్ గౌడ్, మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, ఆకుల వీరేష్, వెలమకూరు భాస్కర్, రాజుగోపాల్ గౌడ్, గోవింద్ గౌడ్, రాజా సాహెబ్, కాకర్ల శాంత కుమార్, జనసేన నాయకులు కే ఉచిరప్ప, రాముడు, చాంద్ బాషా, దేవనకొండ మండలం లో ఉన్న దివ్యాంగులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి బాట

:ఎమ్మెల్యే గిత్త జయ సూర్య

**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మార్చి 18 :**





రైతన్నా -మీకోసం మరియు పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ 3వ విడత నిధులు విడుదల సందర్భంగా, పగిడ్యాల గ్రామంలో రైతుల ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ, కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమతోనే దేశ అభివృద్ధికి వేయవచ్చుననిలక్ష్యమ నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఆర్థికంగా అండగా నిలవడానికి కేంద్ర ప్రభుత్వం రూ.6000 మరియు రాష్ట్ర ప్రభుత్వం రూ. 14000 కలిపి పీఎం కిసాన్ -- అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో నిధులను రూ.20.000 జమ చేయడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమమే దేశాభివృద్ధికి బాట వేస్తుందని పేర్కొంటూ, రైతులు బలంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఎమ్మెల్యే గారు అన్నారు. మొత్తం మీద 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 8985 కోట్ల రూపాయలను సుమారు 46 లక్షల రైతులకు మూడు విడతలుగా అందిచడం జరిగింది అన్నారు.ముఖ్యంగా నందికొట్కూరు, నియోజవర్గానికి 3 విడతలో అన్నదాత సుఖీభవ 36734 రైతులకి సుమారు 21.45 కోట్ల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే రైతన్నా మీకోసం ద్వారా కూటమి ప్రభుత్వం పంచ సూత్రాలతో రైతులకు ఉపయోగపడేలా ముందుకెళ్తుందని తెలియ జేసారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ సంక్షేమాన్ని అందిస్తూ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి మండల కన్వీనర్ మహేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ దామోదర్ రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, విజయ్, హనుమన్న, పాండు, ఆర్టీసీ బాబు, ఎర్రం వెంకటరెడ్డి, చెన్నకేశవు బోయ నాగేంద్ర, బోయ వెంకటేశ్వర్లు, బోయ నాయుడు, సంకిరేణి పల్లె పెద్ద ఎల్లయ్య, ఎన్ శ్రీనివాసులు, చిన్న, పరమేష్, కూటమి నాయకులు వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "దివ్యంగా శక్తి పథకం" ప్రారంభించిన: ఎమ్మెల్యే గిత్త







**ఉత్తేజిత ప్రతినిధి నందికొట్కూరు మార్చి 18 :**

నందికొట్కూరు పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాన్డ్ నందు దివ్యంగ శక్తి పథకం ద్వారా దివ్యంగులకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నందికొట్కూరు నియోజకవర్గం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని వికలాంగులతో కలిసి దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, అందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు దివ్యాంగ శక్తి పథకం ద్వారా వారు ఉచితంగా బస్సులో ప్రయాణం చేయడానికి ఈ పథకం ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి,

రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు

చెల్లా దామోదర్ రెడ్డి, జిల్లా ఉపాధక్షురాలు ప్రసన్న లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు మీనాక్షిదేవి

DR వనజ, అనురాధ, మల్లికార్జున రెడ్డి, సంపత్ కుమార్ యాదవ్, వెంకటరెడ్డి, భరత్, ఆర్ట్ శ్రీను, బ్రహ్మయ్య, గని, కళాకార్, ఆర్టీసీ డిఎం అబ్దుల్ ఖాదర్, సిబ్బంది, అధికారులు పాల్గొనడం జరిగినది.



# సమాజానికి చీడలా..
# డ్రగ్స్ మహమ్మారి !

**రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. మొగ్గలోనే తుంచే యాలి. ఇలాంటి వారు మళ్లీ రాజకీయ జీవితంలోకి రాకుండా కఠిన ఆంక్షలు విధించాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది.**

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది.గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడం లేదు. కఠిన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చి పోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. హైదరాబాద్ నగర శివార్లలోని మొయినాబాద్ అజీజ్ నగర్ లో గల మాజీ ఎంఎల్‌ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీని ఈగల్, ఫోర్త్ సిటీ పోలీసులు గుట్టురట్టు చేయడం వెనుక భారీ ఆపరేషన్ కొనసాగింది. ఈ పార్టీలో ప్రముఖులు వున్నట్లు, ఇందులో డ్రగ్స్ వాడుతున్నట్లు సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు దీనిపై స్థానిక పోలీసుల సహకారంతో గత శనివారం రాత్రి పది గంటల సమయంలో దాడులు చేయడం తెలిసిందే. ఈ సమయంలో అక్కడ ఒక మహిళతోపాటు 11 మంది వున్నారు. వీరంతా మద్యం మత్తులో వుండగా కొందరు డ్రగ్స్ సేవించినట్లు అనుమానాలు వుండడంతో అందరికి డ్రగ్స్ పరీక్షలు జరిపారు. ఇదే సమయంలో వాష్ రూం వద్ద చేతిలో ఎ32 కాలిబర్ రివాల్వరన్ను పట్టుకుని వుండగా అతన్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. అతని పేరు నమిత్ శర్మగా తేలింది. ఇతని చేతిలో వున్న రివాల్వర్ జర్మనీలో తయారైనట్లు తేలింది. ఇతనికి సమీపంలో మరో వ్యక్తి ఖాళీ తూటా పట్టుకుని వుండగా అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇతన్ని సిల్వేరి శరత్‌కుమార్గా గుర్తించారు. ఇతని వద్ద 26 గ్రాముల కొకైన్, భారీగా మద్యం సీసాలు పట్టుబడ్డాయి. ఘటనా స్థలంలో తూటాతో పాటు మొత్తం 4 ఖాళీ తూటాలు లభ్యమయ్యాయి. రివాల్వర్ తోపాటు తూటాను, ఖాళీ తూటాలను పరీక్షల నిమిత్తం ఎఫ్ఎస్ఎల్‌కు పరీక్షల నిమి త్తం పంపారు. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించాడు.

వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా...?

అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.

# మరోమారు భగ్గుమన్న పసిడి ధర

## సగటున పది గ్రాములపై 1200 పెరుగుదల



న్యూఢిల్లీ: గత కొంతకాలంగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు మంగళవారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.1200ల మేర పెరిగింది. వెండి ధర కూడా సగటున రూ.5 వేల మేర ఎగబాకింది. ధరలు దిగివచ్చినప్పుడు వందల్లో దిగుతూ..పెరిగితే వేలల్లో పెరగడం గమనార్హం. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,58,620లకు ఎగబాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.1200ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.1100ల మేర పెరిగి రూ.1,45,400కు చేరుకుంది. నగరంలో వెండి ధర రూ.4 వేల మేర పెరిగింది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.8 లక్షలు పలుకుతోంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,820గా ఉంది. ఢిల్లీలో రూ.1,58,770 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,58,620గా ఉంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,46,500గా, ఢిల్లీలో రూ.1,45,550గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో రూ.1,45,400గా ఉంది. చెన్నైలో కిలో వెండి రూ.2.8 లక్షలకు చేరుకోగా ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది.

# కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

## అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి పాక్ తీరును తీవ్రంగా తప్పపట్టిన భారత్



న్యూఢిల్లీ: అఫ్గానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఎ÷–గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ

సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

# అర్హులకే ఇళ్లు, అక్రమార్కులకు చెక్

**క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు నివాసంలో లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు నోటీసులు ఏప్రిల్ 30వరకు గడువు**
**అనర్హుల స్థానంలో అర్హులకు కేటాయిస్తాం**
**క్యూర్ పరిధిలో హౌసింగ్ పై మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో మంత్రి పొంగులేటి సమీక్ష**




హైదరాబాద్: హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలొగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అ÷-దదెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎంతమంది స్పందించారు అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఐ

అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్దిదారులకు కేటాయించాలన్నారు. అదేవిధంగా వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అ÷-దదె ప్రాతిప దకన గాకుండా వేలం పద్దతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. అంతేగాక ప్రజా ప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని తెలిపారు.

# మీతో కలిసి రాలేం



దుబాయ్, బీరుట్: అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన సంక్షోభం, తద్వారా ఆర్థిక సంక్షోభం భయాలు చుట్టుముడుతున్నాయి. ఈ నేపథ్యంలో బలప్రయోగం ద్వారా హర్మూజ్ జల సంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడికి యుద్ధ నౌకలను పంపేందుకు మిత్ర దేశాలతోపాటు చైనా ససేమిరా అన్నాయి. ఆ యుద్ధంతో నాటోకు సంబంధం లేదని ఐరోపా దేశాలు తెగేసిచెప్పాయి. మరోవైపు ఇరాన్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను కొనసాగించాయి. ఇరాన్ డ్రోన్ దాడితో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తెరిచిన కొద్ది గంటల్లోనే మూసివేయాల్సి వచ్చింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ దాడులను కొనసాగించింది. పశ్చిమాసియాలో సైనిక చర్యను వెంటనే నిలిపేయాలని అమెరికా, ఇజ్రాయెల్‌ను చైనా కోరింది. హర్మూజ్‌ను తెరిపించడానికి చైనా సహా పలు దేశాలు యుద్ధ నౌకలను పంపాలని ట్రంప్ కోరిన నేపథ్యంలో ఆ దేశంస్పందించింది. అన్నివైపుల నుంచీ దాడులను వెంటనే ఆపాలని చైనా సూచించింది.

**హర్మూజ్ ప్రాంతానికి యుద్ధ నౌకలను పంపలేం**

**ట్రంప్‌నకు షాకిచ్చిన మిత్ర దేశాలు**

**ఆ యుద్ధంతో నాటోకు సంబంధం లేదన్న జర్మనీ**

**బ్రిటన్, జపాన్‌దీ అదే వైఖరి**

**పర్షియన్ గల్ఫ్‌లో రవాణాపై ఇరాన్ పట్టుతో ఆందోళన తీవ్రం**

**టెహ్రాన్, బీరుట్‌లపై బాంబుల వర్షం**

**దుబాయ్ విమానాశ్రయంపై దాడి**

**తెరిచిన వెంటనే మూసివేత**

హర్మూజ్‌ను తెరిపించడానికి ఆచరణీయ ప్రణాళికను తాము కోరుకుంటున్నామని బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ తెలిపారు. యుద్ధాన్ని మరింత విస్తరించబోమని స్పష్టంచేశారు. దీనిపై అమెరికా, గల్ఫ్, ఐరోపా దేశాలతో చర్చిస్తున్నామన్నారు. దీనిని బట్టి హర్మూజ్‌కు యుద్ధ నౌకలను పంపే ఉద్దేశం ఆయనకు లేనట్లు కనిపిస్తోంది.

జపాన్ ప్రధాని సనాయీ తకాయిచి పార్లమెంటు వేదికగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పశ్చిమాసియా సముద్ర జలాల మీదుగా రాకపోకలు సాగించే ఆయిల్ ట్యాంకర్లు, నౌకలకు భద్రత కల్పించేందుకు నౌకాదళాన్ని పంపే ఆలోచనేదీ లేదని ఆమె వెల్లడించారు.

## తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం

**తెలుగు జాతి కోసం ప్రాణ త్యాగం**

**అమరజీవి పొట్టి శ్రీరాములు**

**నివాళి అర్పించిన డిప్యూటీ సిఎం పవన్**

అమరావతి: తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేశారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో తెలుగు ప్రజల ఇబ్బందులను ఆయన గుర్తించి.. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడారని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళిగా 58 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన 125వ జయంతి సందర్భంగా అమరావతిలోని శాఖమూరులో ఈ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్.. పొట్టి శ్రీరాములు మన గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహానుభావుడని అన్నారు. స్వాతంత్య్ర సమర కాలంలో మహాత్మా గాంధీ 'నా వెంట 11 మంది ఉంటే దేశానికి స్వాతంత్య్రం తీసుకురాగలను' అన్న మాటలను గుర్తుచేశారు. అలాంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ కళ్యాణ్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

**ఒక మనిషి త్యాగం ..ఒక జాతి గౌరవం**

**నివాళి అర్పించిన మంత్రి లోకేశ్**

అమరావతి: అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా అమరావతి లోని శాఖమూరులో 58 అడుగుల ఎత్తైన భారీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను 'ఉస్తాద్ భగత్ సింగ్' అని మంత్రి సంబోధించారు. 'ఒక మనిషి త్యాగం ఒక జాతి గౌరవం. ఒక మనిషి మరణం ఒక రాష్ట్రం' అని అమరజీవి త్యాగాన్ని స్మరించుకున్నారు.

# కుటుంబం మొత్తానికి ఒకే ఖాతా..

కుటుంబ సభ్యుల్లో ఎంత మంది ఉంటే దాదాపు అన్ని బ్యాంక్ అకౌంట్లు ఉంటాయి. దీంతో మినిమమ్ బ్యాలెన్స్, ఛార్జీలు, నిర్వహణ వంటి అంశాల్లో ఇబ్బందులు వస్తుంటాయి. వాటన్నింటికి పరిష్కారం చూపేందుకు బ్యాంక్ ఆఫ్ బరోడా పరివార్ అకౌంట్ తీసుకొచ్చింది. దీంతో 9 రకాల బెనిఫిట్స్ ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం. ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్త రంగ సేవింగ్స్, కరెంట్ అకౌంట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. బీఓబీ పరివార్ అకౌంట్ పేరుతో కొత్త సేవలు తెచ్చింది. బ్యాంక్ ఆఫ్ బరోడా బీఓబీ కే సంగ్ త్యోహార్ కి ఉమాంగ్ ఫెస్టివల్ క్యాంపెయిన్‌లో భాగంగా ద మై ఫ్యామిలీ మై బ్యాంక్ సెగ్మెంట్ సేవలు తీసుకొచ్చింది. దీని ద్వారా కుటుంబంలోని సభ్యులందరి ఖాతాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి పలు బెనిఫిట్స్ అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఎవరి ఖాతాను వారు నిర్వహించుకుంటారు. కానీ, ఖాతాల్లో కనీస త్రైమాసిక బ్యాలెన్స్ అనేది గ్రూప్ లేదా కుటుంబం పరంగా లెక్కించనుంది బీఓబీ. దీంతో ఒక్కో ఖాతాలో కనీస బ్యాలెన్స్ నిర్వహించాల్సిన అవసరం ఉండదు. ఈ అంశంపై బ్యాంక్ ఆఫ్ బరోడా రిటైల్ లయబిలిటీస్, ఎన్ఆర్ఐ బిజినెస్ చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్ర సింగ్ నేగి పలు విషయాలు వెల్లడించారు. 'ఒకే కుటుంబంలోని సభ్యుల ఖాతాలు లేదా అనుబంధ కంపెనీల ఖాతాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా మా కస్టమర్లకు చాలా బెనిఫిట్స్ లభించనున్నాయి. బీఓబీ పరివార్ అకౌంట్ సెగ్మెంట్‌లో కుటుంబ సభ్యులందరు ఫ్యామిలీ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ తో లాభపడతారు. దీంతో ప్రతి ఖాతాలో త్రైమాసిక సగటు బ్యాలెన్స్ ఉంచాల్సిన అవసరం ఉండదు. 115 ఏళ్ల బ్యాంక్ చరిత్రలో చూసుకుంటే ఒకే కుటుంబంలోని సభ్యులకు సేవందిస్తున్నాం. అర్హతలు ఇవే.. బ్యాంక్ ఆఫ్ బరోడా పరివార్ అకౌంట్ తీసుకోవాలంటే ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు లేదా గరిష్ఠంగా 6 మంది తీసుకోవచ్చు. అందులో జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు, పిల్లలు, అత్తామామలు, మరదళ్లు, బావమర్దులు వంటి వారిని చేర్చుకోవచ్చు. అలాగే బీఓబీ పరివార్ కరెంట్ అకౌంట్ సెగ్మెంట్‌లో ప్రొప్రైయిటర్ షిప్, పార్ట్నర్ షిప్, ఎల్ఎల్‌పీ, ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు వంటి వాటికి అర్హత ఉంటుంది. అవన్నీ ఒక గ్రూప్ కంపెనీ లేదా సిస్టర్ కంపెనీగా ఉండాలి. ఇందులో మూడు రకాల అకౌంట్స్ ఉంటాయి. డైమండ్, గోల్డ్, సిల్వర్ ఖాతాలు ఉంటాయి. ఆయా ఖాతాలను బట్టి మినిమమ్ బ్యాలెన్స్ ఉంటుంది.సేవింగ్స్ అకౌంట్.. డైమండ్ ఖాతాకు రూ.5 లక్షలు, గోల్డ్ ఖాతాకు రూ.2 లక్షలు, సిల్వర్ ఖాతాకు రూ.50 వేలు ఆపైన ఉండాలి. కరెంట్ అకౌంట్ డైమండ్ ఖాతాకు రూ.10 లక్షలు, గోల్డ్ ఖాతాకు రూ.5 లక్షలు, సిల్వర్ ఖాతాకు రూ.2 లక్షలు ఉండాలి.




# ఆ తీయటి గొంతుకలు ..హనీ ట్రాప్

హైదరాబాద్: మారుతున్న పరిస్థితుల రీత్యా ఒంటరితనానికి అలవాటు పడే యువతను లక్ష్యంగా చేసుకొని సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో సైబర్ మోసాలపై ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు హైదరాబాద్ నగర పోలీసులు. ఇందులో భాగంగా 'ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం.. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు అంటూ యువతను ఆకర్షించే రీతిలో సోషల్ మీడియాలో వస్తోన్న యాడ్స్‌పై ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. అయితే, దీని వెనుక ఉన్నది తీయని మాటలు కాదు.. నిలువునా దోపిడీ చేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు పన్నుతున్న హనీట్రాప్ ఇది. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదు. అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలే. మాయమాటలకు బుట్టలో పడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చు కున్నట్లే. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయి. ఇక రాత్రిపూట సరదాగా మాట్లాడదామని వీడియో కాల్ చేశారో.. ఇక అంతే. అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారు. ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ చేస్తూ సెక్స్‌టార్షన్‌కు దిగుతారు. దీంతో పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయం అన్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు అవ్వరు.. ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువును దెబ్బతీసే భారీ కుట్ర దాగి ఉందని తెలుసుకోండి. క్షణికావేశంలో గుర్తు తెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకొని మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు. రాత్రి వేళల్లోనే ఈ తరహా యాడ్స్ దర్శనమిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఈ తరహా సైబర్ వలలో చిక్కుకుంటే.. పరువు పోతుందేమోనని భయపడొద్దు. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయండి. లేదా వెబ్‌సైట్‌లోనైనా ఫిర్యాదు చేయండి. బీ అలర్ట్' అని సజ్జనార్ సూచించారు.

# వరి వేస్తే ఉరి అనలేదా

## ఇప్పుడేమో రైతులు గుర్తుకు వచ్చారా

## అసెంబ్లీలో విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు



హైదరాబాద్: బీఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పుడు వారే రైతుల పాట పాడుతున్నారని అన్నారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్, యంత్ర పరికరాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. ఈనెల 22 నుంచి రైతుభరోసా నిధులు పంపిణీ చేయనున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో 60లక్షల మందికి పైగా రైతులకు ఈ నిధులు జమ చేస్తామన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చలో ఆయన మాట్లాడారు. రైతులు, ప్రజల మద్దతుతో మున్సిపల్, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయం దక్కింది. బీఆర్ఎస్ నేతలు అబద్దాలు ఆడి తప్పుదోవ పట్టిస్తే ప్రజలు విశ్వసించరు. కాళేశ్వరం నుంచి చుక్క నీరు తీసుకోకపోయినా 71.86లక్షల టన్నుల ధాన్యం పండించాం. ఎల్లంపల్లి నీటితో పెద్ద ఎత్తున వరి పండింది. బీఆర్ఎస్ హయాంలో మోటార్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. ఇందిరమ్మ రాజ్యం నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ సేవలందిస్తున్నాయని ఆది శ్రీనివాస్ అన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



హైదరాబాద్: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిరాయింపులపై కెటిఆర్ ప్రస్తావన

**తీర్పు చదవకుండా వ్యాఖ్యలు సరికాదన్న స్పీకర్ స్పీకర్‌ను తప్పపడతారా అంటూ పొంగులేటి ఫైర్**

హైదరాబాద్:పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్ పై స్పీకర్ తీర్పును కేటీఆర్ ప్రస్తావించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే దానం కాంగ్రెస్ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేశారని అన్నారు. దానం పార్టీ మారినట్లు ఆధారలు లేవని స్పీకర్ తీర్పు చెప్పడాన్ని తప్పుబట్టారు. అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన స్పీకర్.. కేటీఆర్ జడ్జిమెంట్ మొత్తం చదవకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. తనపై విమర్శలు చేసిన ప్రతీ సారి మీడియా ముందుకు వచ్చి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఉన్నత పదవిలో ఉన్న తనను అవమానించడం కరెక్ట్ కాదన్నారు. పార్టీ ఫిరాయింపులపై జడ్జిమెంట్ కాపీ పూర్తిగా చదివి మాట్లాడాలని కేటీఆర్ కు సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్ నే ప్రశ్నించడం కరెక్ట్ కాదన్నారు. బీఆర్ఎస్ నిజాయితీగా ఉంటే ఎందుకు ఎన్నికల్లో ఓడిపోతుందని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని ఫైర్ అయ్యారు. అధికారంలో ఉన్నపుడు ఒకలా..ప్రతిపక్షంలో ఉన్నపుడు మరో విధంగా మాట్లాడటం కేటీఆర్ కే చెల్లుతుందన్నారు. కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా కౌంటర్ ఇచ్చారు. మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్టీ ఫిరాయింపుల గురించి మీ నాన్నను అడగాలంటూ కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేసీఆర్ ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని అడిగి తెలుసుకోవాలని సూచించారు.

# అబద్దాలు, సెటైర్లు వేయడం మానుకో

హైదరాబాద్: మహిళలంటే మాజీ మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులైనా, బయట మహిళలనైనా ఎదగనీయాలంటూ కేటీఆర్‌కు మంత్రి చురకలంటించారు. ఫ్రీ బస్‌పై కేటీఆర్ సెటైర్లు, తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు, ఎగతాళి మాటలు బంద్ చేయాలన్నారు. పదేళ్ళు మంత్రిగా మహిళల కోసం కేటీఆర్ ఏం చేశారని సీతక్క ప్రశ్నించారు. మహిళా సంఘాలు ఐదు లక్షల కంటే ఎక్కువ తీసుకోకుండా బారికేడ్లు పెట్టారని.. ఇప్పుడు ఆ బారికేడ్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయో వెళ్లి మహిళలను అడగాలని మంత్రి సవాల్ చేశారు. అభయ హస్తం డబ్బులను కూడా గత ప్రభుత్వం వాడుకుందని సీతక్క ఆరోపించారు. శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తున్నామని మంత్రి వివరించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. కేటీఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు.

# రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయానికి బాటలు

**61 వేల మంది రైతులకు 'ఫార్మర్ కిట్ల' పంపిణీ ప్రారంభం**

**రైతు నేస్తం 86వ ఎపిసోడ్ వేదికగా కార్యక్రమం**

**ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని రైతులకు పిలుపు**

**20 నుండి 22 వరకు ఘనంగా 'రైతు మహోత్సవం'**

**22న నర్మెట్టలో సిఎం చేతుల మీదుగా రైతుభరోసా విడుదల**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




హైదరాబాద్ జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు సచివాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసిన రంగరెడ్డి జిల్లాకు చెందిన రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్లను' అందజేసి రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు వాతావరణం కలుషితం అవుతున్న తరుణంలో, మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతులకు, సమాజానికి క్షేమకరమని ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, ఒక్కో క్లస్టర్ నుండి 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులను ఈ పథకం కోసం ఎంపిక చేశారు. వీరికి అవగాహన తో పాటుగా ఫార్మర్ కిట్లను అందజేశారు. 20, 21, 22 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. 50కి పైగా స్టాల్స్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉంటుందని అన్నారు. 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా యాసంగి సీజన్ రైతు భరోసా నిధుల జమ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ల్గ÷తులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని, పెట్టుబడి ఖర్చులను తగ్గించుకుంటూ అధిక ఆదాయాన్ని గడించాలని మంత్రి ఆకాంక్షించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమంలో లక్ష్యానికి మించి 110శాతం నమోదు చేసి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలచి కేంద్ర ప్రభుత్వం ద్వారా 422.64 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకం పొందడంలో కీలక పాత్ర పోషించిన వ్యవసాయ విస్తరణ అధికారులు మండల వ్యవసాయ అధికారులు సహాయ సంచాలకులు జిల్లా వ్యవసాయ అధికారులను ఈ సందర్భంగా మంత్రి భినందించారు ప్రకృతి వ్యవసాయం రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయానికి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ విధానాన్ని అవలంబించాలని సూచించారు. రూ42 కోట్లతో ఈ పథకాన్ని అమలుచేస్తున్నట్లు, దానిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 489 క్లస్టర్లు దాదాపు 61,125 ఎకరాలలో ఈ సంవత్సరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానంలోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికా చేయడం జరిగిందని అందుకు గాను 61,125 మంది రైతులను ఎంపిక చేసి రైతు వేదికలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని తెలియజేసారు. అంతే గాక వీరికి సాగులో మరియు మార్కెటింగ్ లో తోడ్పడే విధంగా కృషిసఖి లను క్లస్టర్ కు ఇద్దరు చొప్పన నెలకి 5000 గౌరవ వేతనం ఇచ్చి నియమించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన బీజామృతం, జీవామృతం, దశపర్ణి వంటి జీవ ఉత్పాదకాలు స్వయంగా తయారు చేసుకోలేని రైతుల కోసం ప్రభుత్వం జీవ ఉత్పాదక తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఇందుకు రూ లక్ష కేటాయించినట్లు తెలిపారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నర్మెట్టలో రైతు మహోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవంలో వ్యవసాయ, పశుసంవర్ధక మరియు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగపడే దాదాపు 150 ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 22న నర్మెట్టలో ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా మొదటి విడుత రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 20,600/- కోట్ల రైతు రుణమాఫీ ఒకే దఫాలో విడుదల చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు.అంతేగాక గతంలో ఎన్నడూ లేని విధంగా ఖరీఫ్ లో 9 రోజులలో 9000/- కోట్లు రైతు ఖాతాలలో జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిది అని అన్నారు. అదేవిధంగా నూనె గింజలు, పప్పు దినుసులు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఆయిల్ పామ్ సాగు రైతులకు స్థిరమైన ఆదాయం అందించడంలో సహకరిస్తుందని, ప్రకృతి విపత్తులు, పక్షులు, జంతువుల వల్ల కలిగే నష్టాలు తక్కువగా ఉంటాయని మంత్రి వివరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి , తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, వ్యవసాయ సంచాలకులు బి. గోపి పాల్గొన్నారు

# అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం



హైదరాబాద్, అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం..అందుకు మీరు సిద్దమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌజ్ డ్రగ్స్ కేసు సిగ్గు చేటని, బిఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేష్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్‌కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

## రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా

# ఢిల్లీ వెళతాం

హైదరాబాద్: కెటిఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేటీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్‌గా మాట్లాడితే బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదన్నారు. మహిళలంటే ఎందుకు చులకన అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. 'మీరు పావలా వడ్డీ ఇవ్వలేదు.. మేము ఇస్తున్నాం. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారు. ఈరోజు కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఎంవోయూ, పెట్టుబడులపై ఆయన వివరణ ఇచ్చారు. సిఎం పదేపదే ఢిల్లీకి వెళుతున్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. కేంద్రంతో కొట్లాడి అయినా నిధులు తెచ్చి, రాష్ట్రాన్ని బాగు చేస్తామని అన్నారు. ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేముందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని.. ఢిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నామన్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నోసార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధానమంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసా÷-లంల్గ÷నా ఢిల్లీకి వెళతామని.. ప్రధానిని మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఎ÷-లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు

## జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్



హైదరాబాద్: తెలంగాణ లోక్‌భవన్‌లో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. గవర్నర్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆహుతులను స్వయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇక్కడికి విచ్చేసిన విశిష్ట అతిథులకు, ఆహ్వానితులకు, లోక్ భవాని పరివార్ సభ్యులకు మరియు కళాకారులకు పేరు పేరున నాహృదయపూర్వక నమస్కారములు అని అన్నారు. మీ అందరికీ శ్రీ 'పరాభవ' నామసంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు అని తెలిపారు. ఈ నూతన సంవత్సరం మీ కుటుంబాల్లో ధన, ఆరోగ్య, సంతోషాలను నింపాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. అరవై ఏళ్ల కాలచక్రంలో 'పరాభవ' 40 వ సంవత్సరం.. పరాభవ అంటే.. మనలోని అహంకారాన్ని, చెడు ఆలోచనలను ఓడించి, విజయానికి పునాది వేసేదని అర్థం. ఈ సంవత్సరం మనందరి అభ్యున్నతి సంవత్సరంగా మారుతుందని నా విశ్వాసం అని గవర్నర్ శుక్లా ఆకాంక్షించారు. మన తెలంగాణ రాష్ట్రం మరియు దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. గత అనుభవాల నుండి నేర్చుకుంటూ, మరింత నిబద్ధతతో, సేవాభావంతో మన లక్ష్యాల వైపు అడుగులు వేయాలి. ఉగాది అంటేనే కొత్త శకం. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి మన జీవితంలోని కష్ట సుఖాల కలయికను సూచిస్తుంది. ఈ ఏడాది రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలతో తెలంగాణ కళకళలాడాలని మనసారా కోరుకుంటున్నాను అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క,మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఇదిలావుంటే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ విషయంలో స్పీకర్‌దే తుది నిర్ణయమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. జీవన్‌రెడ్డిని పార్టీ ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదన్నారు. బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్షనేత కేసీఆర్ రావాలని కోరారు. కేసీఆర్ అనుభవం అసెంబ్లీకి అవసరం. మంత్రుల మార్పులు, చేర్పుల్లో సీఎంకే పూర్తి స్వేచ్ఛ ఉందని శ్రీధర్‌బాబు అన్నారు.

# టిక్కెట్ రేట్లపై పవన్ కామెంట్స్

## 18శాతం ప్రభుత్వానికే పోతుంది



ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో, పవన్ కళ్యాణ్ టికెట్ రేట్ల పెంపుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 'సినిమాని తెలుగు ప్రేక్షకుల నుంచి గానీ, భారతదేశం నుంచి గానీ దూరం చేయలేము. ఎంటర్‌టైన్‌ట్ ఈజ్ ద సోల్ ఆఫ్ దిస్ నేషన్. అది మన సంస్కృతులకు మూలం. అందుకని ఈ సినిమాని మన జీవితాల్లో నుంచి తీసేయలేము. అలాగే, నాకు ఎప్పుడూ ఏ హీరో విజయం మీద ఇన్సెక్యూరిటీ ఉండదు. అందరూ బాగుండాలని కోరుకుంటాను.సినిమా ఈజ్ నాట్ ఏ కంపల్సరీ. ఏమన్నా గన్ పాయింట్‌లో పెట్టి మీరు చూడాలి అనుకోము కదా. మనకు ఛాయిస్ ఉంది, ఈ రోజున అమెజాన్ కావచ్చు, మల్టిపుల్ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్స్ ఉన్నాయి. ఫస్ట్ డే వెళ్లి చూడాలనుకోవడంలో, వీళ్లు ఇంత ఖర్చు పెట్టి ఉంటారు కాబట్టి అడుగుతుంటారు. నా సినిమాలకి నేను ఇంకా తక్కువ రేట్లు ఇచ్చుకున్నాను, కానీ మిగతా హీరోల సినిమాలకి నేను ఎక్కువ రేట్లు ఇప్పించాను. టికెట్ రేట్లు పెంచమని నా దగ్గరికి వస్తారు. అసలు నాకు సంబంధం లేదు. నేను ఏదైనా ఉంటే ఒకటే అడుగుతాను.. ఆంధ్రప్రదేశ్‌కి ఏదైనా సినిమాలు వచ్చి మిగతా హీరోలు, నిర్మాతలు వచ్చినప్పుడు నేను ఒకటే అడుగుతాను: 'మీరు ఎవ్వరినీ దేహి అనకండి'. దయచేసి మీరు దేహి అనద్దు. మీరు ఎంత కష్టపడి తీస్తారో నాకు తెలుసు. పైగా మీరు పెంచిన ప్రతి రూపాయిలో 18శాతం జీఎస్టీకి వెళ్తది. వదిలేస్తే ఎవరో బ్లాక్‌లో టికెట్లు అమ్ముకొని మళ్ళీ అది క్యాష్‌గా వెళ్ళిపోద్ది. అది గవర్నమెంట్‌కి రెవెన్యూ కాదు, ఎవరికీ కాదు. దీన్ని బేస్ చేసుకొని.. నేను ఆంధ్రప్రదేశ్‌కి, ప్రత్యేకించి అది ఎన్డీఏ ప్రభుత్వం కాబట్టి నేను మనస్ఫూర్తిగా, ఇర్రెస్పెక్టివ్ ఆఫ్ హీరో.. అది 'పుష్ప' కావచ్చు, లేదంటే మన జూనియర్ ఎన్టీఆర్ గారు కావచ్చు, మహేష్ గారిది కావచ్చు (మహేష్ గారి సినిమా రిలీజ్ అయిందో లేదో తెలియదు కానీ నాకు ఈ మధ్య కాలంలో), ఏ సినిమా వచ్చినా గానీ, ఇంక్లూడింగ్ 'కల్కి' ప్రభాస్ గారు కావచ్చు, ఇంక్లూడింగ్ మన 'కాంతార' కూడా. కర్ణాటకలో తెలుగు సినిమా పోస్టర్లు కూడా పడకూడదు అని అన్నా గానీ, నేను 'కాంతార'కి ఆ వివక్ష చూపించలేదు.




# ఉస్తాద్‌లో..తొలిప్రేమనాటి పాట రీమిక్స్



పవన్ కల్యాణ్ కెరీర్‌లో ల్యాండ్ మార్క్ మూవీ తొలిప్రేమ. ఈ సినిమాలోని ప్రతీ సీన్ కూడా మూవీ లవర్స్‌కు ఎప్పటికీ గుర్తుండిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక పాటలైతే సూపర్ హిట్ ఆల్బమ్స్‌లో ఒకటిగా నిలిచిపోతాయి. ఇప్పటికీ మ్యూజిక్ లవర్స్ ఈ సాంగ్స్‌ను చాలా ఫ్రెష్‌గా తెగ ఎంజాయ్ చేస్తుంటారు. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ మార్చి 19న ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుందని తెలిసిందే. ఉస్తాద్ భగత్ సింగ్‌లో మళ్లీ తొలి ప్రేమలోని ఈ మనసే సాంగ్‌ను రీక్రియేట్ చేసినట్టు పవన్ కల్యాణ్ అభిమానులకు సర్‌ప్రైజ్ అప్‌డేట్ అందించాడు. ఈ సాంగ్ పవన్ కల్యాణ్, శ్రీలీలపై ఉండబోతుండగా.. అభిమానులు, మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్‌కు లోను చేస్తుంది ఉస్తాద్ భగత్ సింగ్‌గా మాస్ అప్పీల్‌లో కనిపించబోయే పవన్ కల్యాణ్.. మరోసారి తొలిప్రేమలో లవర్‌బాయ్‌లా ఎలా కనిపిస్తాడోనంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు అభిమానులు. ఇక రీక్రియేట్ చేయబోతున్న పాటలో శ్రీలీల తొలిప్రేమ హీరోయిన్ కీర్తిరెడ్డిని మరిచిపోయేలా చేస్తుందో లేదో చూడాలి.టాలీవుడ్ టాప్ లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో రాశీఖన్నా కీలక పాత్రలో నటిస్తోంది. పార్థిబన్ విలన్‌గా నటిస్తుండగా.. గౌతమి, కేఎస్ రవికుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీకి దేవీ శ్రీ ప్రసాద్ పాటలు కంపోజ్ చేస్తుండగా.. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వర్క్ ఎస్ థమన్ చేస్తున్నాడు.









### అట్టహాసంగా ఉస్తాద్ ప్రీ రిలీజ్ ఈవెంట్

# ప్రత్యేకమైన టీ షర్ట్‌తో హరీష్ శకర్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, మాస్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ-రిలీజ్ వేడుక అభిమానుల మధ్య సందడిగా జరిగింది. అయితే ఈ ఈవెంట్‌లో సినిమా విశేషాలతో పాటు దర్శకుడు హరీష్ శంకర్ ధరించిన ఒక ప్రత్యేకమైన షర్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. హరీష్ శంకర్ ధరించిన నల్లటి షర్ట్ కేవలం ఫ్యాషన్ మాత్రమే కాదు, పవన్ కళ్యాణ్‌పై ఆయనకున్న అభిమానాన్ని ప్రతిబింబించింది. ఆ షర్ట్‌పై పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన ఐకానిక్ మేనరిజమ్స్‌తో పాటు 'గబ్బర్ సింగ్', 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలకు సంబంధించిన మాస్ పోస్టర్లు కళాత్మకంగా ముద్రించబడ్డాయి. ముఖ్యంగా షర్ట్ వెనుక భాగంలో పవన్ కళ్యాణ్ ఫోటోతో పాటు ఆయన సినిమాల్లోని పవర్‌ఫుల్ డైలాగులను గుర్తు చేసే గ్రాఫిక్స్ ఉండటం అభిమానులను ఆకట్టుకుంది. ఈ ప్రత్యేకమైన షర్ట్ చూసిన అభిమానులు సోషల్ మీడియాలో విపరీతంగా స్పందిస్తున్నారు. హరీష్ శంకర్ తన స్టైల్‌తో పవర్ స్టార్ మాస్ మేనియాను కొత్తగా చూపించారని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ షర్ట్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు పవన్ కళ్యాణ్ ఈ వేడుకలో తనదైన సింప్లిసిటీతో అభిమానుల మనసు గెలుచుకున్నారు. భారీ అంచనాలు ఉన్న సినిమా కార్యక్రమం అయినప్పటికీ, ఆయన చాలా సాధారణంగా వైట్ కుర్తా ధరించి ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా అభిమానులపై ఆయన చూపించే ఆత్మీయత మరోసారి అందరినీ ఆకట్టుకుంది. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం 2026 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.




















# ఆస్కార్‌లో ధర్మేంద్ర, కోటలకు నివాళి

అద్భుతమైన నటనతో కోట్ల మంది అభిమానులను సొంతం చేసుకొని.. గతేడాదిలో తుదిశ్వాస విడిచిన నటీనటులకు ఆస్కార్ నివాళులర్పించింది. లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 98వ ఆస్కార్ అవార్డుల వేడుకలో ప్రపంచవ్యాప్తంగా సినీరంగం కోసం కృషి చేసిన గొప్ప కళాకారులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హాలీవుడ్ ప్రముఖులతో పాటు భారతీయ సినిమా నుంచి ధర్మేంద్ర, మనోజ్ కుమార్, బి.సరోజాదేవి, కోట శ్రీనివాసరావు వంటి దిగ్గజాల పేర్లను అకాడమీ తన అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా పొందుపరిచింది.ఆస్కార్ వేడుక ప్రారంభంలో గతేడాది మరణించిన హాలీవుడ్ ప్రముఖులకు నివాళులర్పిస్తూ వీడియోను ప్రదర్శించారు. వారిని స్మరించుకుంటూ వారితో ఉన్న జ్ఞాపకాల గురించి కొందరు వేదికపై మాట్లాడారు. అయితే, ఆ వీడియోలో ధర్మేంద్రను చూపించకపోవడంతో అభిమానులు అసహనం వ్యక్తంచేస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెట్టారు. సమయాభావం వల్ల వీడియోలో కొందరినే చూపారని.. ఆ తర్వాత అందరి పేర్లను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచారని హాలీవుడ్ మీడియా పేర్కొంది. 89 ఏళ్ల వయసులో గతేడాది నవంబర్ 24న ధర్మేంద్ర తుదిశ్వాస విడిచారు. సినీ పరిశ్రమకు ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్రం పద్మ విభూషణ్‌తో సత్కరించింది. ఇక 40 ఏళ్ల సుదీర్ఘ సినీ కెరీర్ కలిగిన కోట శ్రీనివాసరావు గతేడాది జులై 13న మరణించిన విషయం తెలిసిందే.

# వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్

ఆస్కార్‌లు పండించిన మూవీఏకంగా ఆరు ఆస్కార్‌లు ప్రదానం కథలో బలం, పాత్రల మధ్య సంఘర్షణ ఉండాలే గానీ.. బాక్సాఫీసు లెక్కలతో పని లేకున్నా పురస్కారాల పంట పండుతుందని వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ సినిమా నిరూపించింది. సినీ రంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే అకాడమీ అవార్డుల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా ఆరు 'ఆస్కార్ లు అందుకుంది. బిడ్డ నమ్మకం గెలుచుకోవడం కోసం ఓ తండ్రి పడే తపనను హృద్యంగా తీర్చిదిద్ది ఉత్తమ దర్శకుడిగానూ అవార్డు అందుకున్నారు పాల్ థామస్ అండర్సన్. బ్లాక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రంలో లియోనార్డో డికాప్రియో కీలక పాత్ర పోషించారు. విప్లవకారుల గ్రూప్ ఫ్రెంచ్ 75లో సభ్యులైన ప్యాట్ కల్హౌన్ (లియోనార్డో డికాప్రియో), పెర్ఫిడియా బేవర్లీ హిల్స్ (టియానా టేలర్) సహజీవనంలో ఉంటారు. ఓ నిర్బంధ కేంద్రం నుంచి వలసదారులను విడిపించే క్రమంలో అక్కడి కమాండింగ్ అధికారి స్టీవెన్‌ను పెర్ఫిడియా అవమానిస్తుంది. దీంతో వీరిద్దరిపైనా అతడు పగ పెంచుకుంటాడు. ఆ తర్వాత ఓ కేసులో ఆమెను పట్టుకున్న స్టీవెన్.. తనతో ఏకాంతంగా గడిపితే విడిచిపెడతానని షరతు పెడతాడు. ఇందుకు పెర్ఫిడియా అంగీకరిస్తుంది. కొంతకాలానికి ఆమె బిడ్డకు జన్మిస్తుంది. కానీ, ఆ చిన్నారిని, తన భాగస్వామి ప్యాట్‌ను వదిలేసి మళ్లీ విప్లవం బాట పడుతుంది. ఈ క్రమంలోనే స్టీవెన్ సాయంతో మెక్సికోకు వెళ్లిపోతుంది.

# బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. ...మాతృభూమిగా మార్పు

బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. తాజాగా మాతృభూమి  పేరుతో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ మేరకు కొత్త పేరుతో ఉన్న పోస్టర్‌ను సల్మాన్ ఖాన్ తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. దాదాపు ఆరేళ్ల క్రితం జరిగిన గల్వాన్ ఘర్షణల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో సల్మాన్ ఖాన్.. కర్నల్ సంతోష్‌బాబుగా నటిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాకు అపూర్వ లఖియా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రాంగద సింగ్ కథానాయిక. గతేడాది డిసెంబరులో సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయగా.. ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది. అయితే, నాడు దీనిపై చైనా అధికారిక మీడియా అక్కసు వెళ్లగక్కింది. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ నోరు పారేసుకుంది. ఈ చిత్రం జాతీయవాద మెలోడ్రామా అని చైనా ఆరోపించింది. ఈ పరిణామాల వేళ తాజాగా సినిమా పేరును మార్చడం గమనార్హం. వాస్తవానికి ఈ చిత్రాన్ని ఏప్రిల్ 17న విడుదల చేయనున్నట్లు తొలుత వార్తలు వచ్చాయి. ఇప్పుడు పేరు మార్పుతో దీని విడుదల మరింత ఆలస్యమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

Uttejitha:-Printed,editor,Pablished And owned By M.chandrasek her.46-801u2.Budhawerpeta.kurnool.andrapradesh.pin 518002.printed At Uttejitha -Printers.Kurnool.Ap.cell 9440140418. RNI ApTEEL2008/24570.